క్లుప్తంగా

అద్దె భవనంలోకి పోలీస్ స్టేషన్



మాట్లాడుతున్న సీపీ గౌస్ అలం

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ శివారులో అద్దె భవనంలో ఏర్పాటు చేసిన కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సీపీ గౌస్ అలాం ప్రారంభించారు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరుకోవడంతో భయంభయంగా విధులు అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన అధికారులు అద్దె భవనంలోకి మార్చారు. ఎస్‌హెచ్‌వో, రిసెప్షన్, రికార్డు, రైటర్ గదిని పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఎస్సై శేఖర్‌రెడ్డిని కుర్చీలో కూర్చోబెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అద్దె భవనంలో కొనసాగే పోలీసు స్టేషన్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. సీపీ వెంట ఏసీపీ మాధవి, సీఐ వెంకటి, పోలీస్ అధికారులున్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై రాజు

రామడుగు: మండలంలోని వెదిర బీసీ సీనియర్ విద్యార్థుల హాస్టల్‌లో పోలీసులు సోమవారం మత్తుపదార్థాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వీటివల్ల జీవితం నష్టపోవాల్సి వస్తుందని సూచించారు. డ్రగ్స్ విక్రయించినా, కొనుగోలు చేసినట్టు తెలిస్తే 8712670767, 8712670721 నంబర్లకు సమాచారం అందజేయాలని కోరారు.

కొనసాగుతున్న దీక్ష



దీక్ష చేస్తున్న గ్రామస్తులు

వీణవంక: ఉపాధి కల్పించాలని కోరుతూ మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామస్తులు చేపడుతున్న నిరసన దీక్ష 26వ రోజుకు చేరింది. ఇసుక లారీల మీద తాటిపత్రులు కప్పే పని కల్పించడం లేదని, అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై సమస్య పరిష్కరించడంలేదని వాపోయారు. మంగళవారం వంటా వార్పు కార్యక్రమం చేపడుతున్నామని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించే వరకు దీక్ష విరమించమని, ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మ్యాక సమ్మయ్య, గెల్లు మల్లయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

చందాలతో మరమ్మతు



గంగాధర: మండలంలోని మంగపేట గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది, నడవడానికి ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో గ్రామస్తులే చందాలు వేసుకొని రోడ్డు మరమ్మతు చేసుకున్నారు. రెడ్డి సంఘం సభ్యులు, గ్రామస్తులు గుంతల్లో మట్టి పోయించారు.

ఇసుక డంపు సీజ్

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఇసుక డంపును సీజ్ చేశామని తహసీల్దార్ రజిత తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన సుమారు 96 ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని, ఇదే గ్రామంలో ఈ నెల 1న సీజ్ చేసిన 135 ట్రిప్పుల ఇసుకతో పాటు 96 ట్రిప్పుల ఇసుకకు ఈ నెల 6న మధ్యాహ్నం 12గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేయనున్నామని, వేలంలో పాల్గొనేవారు ఒక్కో ట్రిప్పుకు రూ.1800 చొప్పున చెల్లించాలని వివరాలకు తహసీల్దార్ కార్యాలయం సంప్రదించాలని సూచించారు.

ఒకరిపై కేసు

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన శివరాత్రి బాపు విధులకు ఆటంకం కలిగించడంతో కేసు నమోదు చేశామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. చల్లూరు మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకునే క్రమంలో దురుసుగా ప్రవర్తించాడని, అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

దిగొచ్చిన సన్నబియ్యం ధరలు

- మధ్య తరగతి కుటుంబాల హర్షం
- ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో తగ్గిన వైనం
- మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడంతో గిరాకీ అంతంతే
- తల పట్టుకుంటున్న వ్యాపారులు



హుజూరాబాద్‌లోని ఓ రైస్ మిల్లులో పేరుకుపోయిన బియ్యం సంచులు

హుజూరాబాద్: సన్నబియ్యం ధరలు దిగొచ్చాయి. మధ్య తరగతి కుటుంబాలు బియ్యం కొనాలంటే వామ్మో అనేవారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లలో ధరలు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు, మిల్లర్లు, దుకాణాదారులు చెబుతున్నారు. ఓ పక్క రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తుండటంతో పాటు కేంద్ర ప్రభుత్వం మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ చేయడంతో సన్నబియ్యం కొనుగోలు చేసేవారు తగ్గారు. దీంతో దుకాణాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండు నెలల్లోనే రూ. 700–1000 ధరలు పడిపోవడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సన్నబియ్యం రెగ్యులర్‌గా కొనేవారిలో మధ్య తరగతి కుటుంబాలే ముందు వరుసలో ఉంటాయి. కొంతమంది దుకాణాదారుల వద్ద కిలోల చొప్పున, మరికొంత మంది నేరుగా మిల్లర్ల వద్దే కొనుగోలు చేస్తారు. రూ.5 వేలకు పైగా ధర పలికిన సన్న బియ్యం ఇప్పుడు రూ.4 వేలకు పైనే పరిమితమయ్యాయి. జై శ్రీరాం బియ్యం రూ.6 వేల ధర పలికి ఇప్పుడు రూ.5 వేలకు పడిపోయింది. ఆర్ఎన్ఆర్, బీపీటీ బియ్యం రూ.నాలుగు వేల లోపే అమ్మాల్సిన పరిస్థితి వచ్చింది. రైస్‌మిల్లుల వ్యాపారులకు సన్న బియ్యం ధరలు తగ్గడంతో నష్టం చవిచూస్తున్నారు. సన్నాలు పండించిన రైతులకు ప్రభుత్వం బోనస్‌తో కలిపి దాదాపు రూ.3 వేల వరకు మద్దతు ధర వస్తుండడంతో బియ్యం ధరలు పెరిగి కొన్ని రోజుల పాటు లాభాలు గడించారు. కానీ ఇప్పుడు సన్న బియ్యాన్ని అడిగేవారు లేకపోవడంతో మిల్లుల్లో బియ్యం నిల్వలు పెరిగిపోయాయి. కొంత మంది మిల్లర్లు ఇంకా సన్న వడ్లను మరాడించకుండానే పక్కన పెట్టేశారు. సాధారణ మిల్లర్లు కూడా వెయ్యి క్వింటాళ్లకు పైగా సన్నవడ్లను కొనుగోలు చేసి అమ్మేవారు. పెద్ద మిల్లర్లు దాదాపు 3000–5000 క్వింటాళ్ల వరకు మరాడించి దుకాణాదారులు, హోటళ్లకు పంపించేవారు. కానీ గత రెండు నెలలుగా మిల్లులు సైతం పనిచేయడం ఆగాయి. ప్రభుత్వానికి పంపిద్దామని చూసినా ఇప్పటికే గోదాములు నిండిపోయాయని పంపిస్తే తీసుకోబోమని చెబుతున్నారని సమాచారం.

బియ్యం ధరల వివరాలు

రకం	మే	జూన్/జూలై	తగ్గిన ధర
సాంబమసూరి	రూ.6000	రూ.4700	రూ.1300
జై శ్రీరాం	రూ.6500	రూ.4900	రూ.1600
స్టీమ్ రైస్	రూ.5000	రూ.3900	రూ.1100
బీపీటీ	రూ.5000	రూ.4300	రూ.700
ఆర్ఎన్ఆర్	రూ.5500	రూ.4500	రూ.1000

భారీగా నష్టపోయాం



పంటకోత కాగానే సన్నబియ్యం కోసం ఆర్డర్లు వచ్చేవి. ఈసారి రేషన్ ద్వారా మూడు నెలల బియ్యం పంపిణీ చేసేసరికి సన్నబియ్యం కొనేవారు తక్కువయ్యారు. సగానికి పైగా వ్యాపారం పడిపోయింది. మిల్లుల్లోనే నిల్వలు పేరుకుపోయాయి. ఒక్కసారిగా ధరలు తగ్గడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వానికి పంపించాల్సిన బియ్యం సైతం గోదాముల్లో నిండిపోయింది.

– నూక శ్రీనివాస్, రైస్‌మిల్ యాజమాని, హుజూరాబాద్



ఇల్లందకుంట: మండలంలోని కనగర్తిలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఇకనైనా స్పందించి జీపీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి

శివకుమార్, పంచాయతీరాజ్ ఏఈ , ఇల్లందకుంట సెల్ నం.630153145

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ధ్యానంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

గంగాధర: విద్యార్థులు మానసిక, శారీరక ఒత్తిడిని ధ్యానంతో అధిగమించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయ సూచించారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్(ధ్యానం) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో అనేక రకాల ఒత్తిడి, ఆందోళన, మానసిక వేదనకు గురవుతుంటారని అలాంటి సమయాల్లో ధ్యానం ఉపయోగపడుతుందని, ధ్యానం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎల్ సురేష్, ఉపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య, ప్రమీల, కొండాల్‌రెడ్డి, ఇందూర, ఇందిర, రాజమహేందర్‌రెడ్డి, రాజు, శేఖర్, మనోహర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సుగుణ



వెదిర అంగన్‌వాడీ కేంద్రంలో..

హుజూరాబాద్: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు ప్రారంభించారు. బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గూర్చి సీడీపీవో ప్రాజెక్ట్ ఆఫీసర్ సుగుణ అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్స్ పద్మ, రాజశ్రీ, రమ, డీసీ నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

రామడుగు: మండలంలోని వెదిర ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం శ్రీరాజరాజేశ్వరీ లయన్స్ క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. క్లబ్ ప్రతినిధి రాల్లబండి శశికళ జన్మదినం పురస్కరించుకొని గర్భిణులు, తల్లులకు పండ్లు, స్టీల్ బేషన్స్ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు పట్టిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరహరి లక్ష్మారెడ్డి, బండ కిషన్‌రెడ్డి, ప్రతినిధులు గుండవేని రాంచంద్రం, రాళ్లబండి శశికళ, రాళ్లబండి శంకర్‌ప్రసాద్ రెడ్డి, వనజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ వంచ భాగ్యరాణిని క్లబ్ ప్రతినిధులు శాలువాలతో సన్మానించారు.



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డా. సంధ్యారాణి



ఇంటింటి సర్వేలో డాక్టర్ తులసీదాస్

వైద్యశిబిరం

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని మైనార్టీ గురుకుల పాఠశాల(బాలికల)లో వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 83 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. పలువురు విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి, వ్యాధి నిర్ధారణకు పంపించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నదియా ఫర్హాజ్, స్టాఫ్ నర్సు రాణి, ఏఎన్ఎం రమదేవి, ఆశా కార్యకర్తలు సరిత, శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిసేడు గ్రామంలో..

ఇల్లందకుంట: ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని సిరిసేడు గ్రామంలో సోమవారం పీహెచ్‌సీ డాక్టర్ తులసీదాస్ ఆధ్వర్యంలో హౌస్ టు హౌస్ సర్వే చేసి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శ్యామల, ఏఎన్ఎం సత్య, రజత, మానస, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఖాళీలు

మానకొండూర్: మండలంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నామని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ ప్రకటనలో తెలిపారు. ఆరో 36, ఏడు 12, ఎనిమిది 5, తొమ్మిదిలో 7, ఇంటర్ ఫస్టియర్ బైపీసీ 8, సీఈసీ 15, ఎంఈసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులు, ఆసక్తి కలిగిన విద్యార్థులు పాఠశాల పనిదినాల్లో ఆధార్, స్టడీ, కండక్ట్, క్యాస్ట్ తదితర సర్టిఫికెట్లతో సంప్రదించాలని కోరారు.

ఏఐవైఎఫ్ కార్యవర్గం



శివకుమార్, రవి

చిగురుమామిడి: అఖిల భారత యువ జన సమైక్య(ఏఐవైఎఫ్) చిగురుమామిడి మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పైడిపెల్లి శివకుమార్, ప్రధానకార్యదర్శిగా చెంచల రవి, సహాయ కార్యదర్శులుగా అందె పవన్, సూరం శ్రీనివాస్, కోశాధికారిగా బీస అజయ్ ఎన్నికయ్యారు. మండలంలోని యువతను చైతన్య పరచాలని, ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. ఎన్నికకు సహకరించిన అందరికీ నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేశ్ గౌడ్ తెలిపారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆలయ అభివృద్ధి, కల్యాణ మహోత్సవానికి ధన, వస్తు, కనక రూపంలో సహకరించే భక్తులు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు.

8న గద్దర్ వర్ధంతి

హుజూరాబాద్: ప్రజా యుద్ధనౌక గద్దర్ రెండో వర్ధంతిని విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సమైక్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శనిగరం బాబ్జి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 8న పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్లో జరిగే సభకు పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు భరత్, డప్పు వాయిద్యకారుడు సురేష్, ప్రముఖ గాయకుడు రావుల సాయి పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు, సైకిళ్ల పంపిణీ



ఇల్లందకుంట: విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రామడుగు: రామడుగు, వెదిర, గుండి, గోపాల్‌రావుపేట, వెలిచాల, దేశరాజ్‌పల్లి, రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం బీజేపీ నాయకులు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మోడీ రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ యాదవ్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు జిన్నారం విద్యాసాగర్, నాయకులు ఉప్పు రాంకిషన్, బండ తిరుపతిరెడ్డి, నరేష్, శ్రీకాంత్, కట్ట రవీందర్, అంజిబాబు, శివ, నర్సింగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి కొత్తపల్లి–ఇందిరానగర్‌కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఈవో భూపతి శ్రీనివాస్ తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రతిభ గల విద్యార్థుల వివరాలను నమోదు చేసుకున్నారు. విద్యార్థులకు పాఠశాల గణిత ఉపాధ్యాయుడు విక్రమ్ చౌరవతో హైదరాబాద్‌లోని శ్రీకర ఫౌండేషన్ సహకారంతో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.



దుస్తులు అందజేస్తున్న ఎంఈవో

'కోటా పరిచయ్ 2కే25' సంబరాలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అంజిరెడ్డి

కొత్తపల్లి: రేకుర్తిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం 'కోటా పరిచయ్ 2కే25' పేరిట నిర్వహించిన కోటా ఇనిస్టిట్యూట్ ఫ్రెషర్స్ వేడుకలు అలరించాయి. వేడుకలను ఆ విద్యా సంస్థల చైర్మన్ డి.అంజిరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ అధ్యాపకులు చెబుతున్న పాఠాలను చక్కగా వింటూ ఉత్తమ మార్కులు తెచ్చుకోవాలని, తద్వారా విద్యా సంస్థకు, తల్లిదండ్రులకు మంచిపేరు వస్తుందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ బి.సుదర్శన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని పీహెచ్‌సీలకు మోడల్‌గా ఉండాలి



డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటరమణ

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్రంలోనే మోడల్ పీహెచ్‌సీగా తీర్చి దిద్దాలని తెలంగాణ డైరెక్టర్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి రవీంద్రనాయక్ వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం పీహెచ్‌సీని పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేసి, ఎప్పటికప్పుడు గ్రామాల్లో డ్రై డే నిర్వహించాలన్నారు. ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ , డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్, ప్రోగ్రాం ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌వో, సూపర్‌వైజర్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాలు అభివృద్ధి



మాట్లాడుతున్న ప్రభాకర్

చిగురుమామిడి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ కోరారు. సోమవారం మండలంలోని చిన్నముల్కనూర్‌లో హుస్నాబాద్ నియోజకవర్గస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పీఎం నరేంద్రమోదీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, కేంద్రం నిధులు మంజూరు చేస్తుందన్నారు. కాంగ్రెస్ అమలుకానీ హామీలతో ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌లో ముస్లింలను కలపాలని చూస్తుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, చిగురుమామిడి, కోహెడ, హుస్నాబాద్, సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, అక్కన్నపేట మండలాల బీజేపీ అధ్యక్షులు పోలోజు సంతోష్‌కుమార్, జాడిగం రమేశ్, బూక్య సంపత్‌నాయక్, దేంచనాల శ్రీనివాస్, శ్రీరామోజు శ్రీనివాస్, మత్తూరి శ్రీకాంత్, రామంచ మహేందర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

నీళ్లు విడుదల చేసేదాకా పోరాటం

రామడుగు: కరీంనగర్ జిల్లాలో ఆదివారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ల పర్యటన ముగియగానే ప్రభుత్వం పంపుహౌజ్‌ల నుంచి నీటి పంపింగ్‌ను నిలిపివేసిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. కాళేశ్వరం మోటార్లు నడిపించాలని డిమాండ్ చేయడంతో పాటుగా రైతుల నుంచి వచ్చిన డిమాండ్‌కు ప్రభుత్వం దిగివచ్చి మంత్రుల పర్యటనను ఎక్కడ అడ్డుకుంటారోనని కాళేశ్వరం లింక్–2 మోటార్లు ఆన్ చేసి నీటిని పంపింగ్ చేసి ఆ తర్వాత నిలిపివేశారని అన్నారు. వర్షాకాలంలో నీరు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, నీటిని విడుదల చేసే వరకు రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

వ్యవసాయాధికారుల క్షేత్ర సందర్శన



హుజూరాబాద్: మండలంలోని కనుకులగిద్దె గ్రామంలో నానో యూరియా ప్రాముఖ్యతపై ఐఎఫ్ఎఫ్‌సీవో కంపెనీ ప్రతినిధులు, ఏడీఏ సునీత రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా వల్ల లాభాలు, సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయ మార్గాలు వివరించారు. తక్కువ మోతాదులో వాడిన మొక్కలకు అవసరమైన పోషకాలను అందిస్తుందన్నారు. అనంతరం క్రిమిసంహారక మందులను డ్రోన్ ద్వారా వేసే విధానం తెలియజేశారు. కార్యక్రమంలో ఏవో భూమిరెడ్డి, ఏఈవో అనూష చిన్మయి, కంపెనీ సేల్స్ మేనేజర్ బాలాజీ, ప్రతినిధి పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.